క్లుప్తంగా

'కాకో'ను దర్శించుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

దండేపల్లి: గిరిజనుల ఆరాధ్యదైవం అయిన దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున వెలసిన శ్రీపద్మల్‌పురి కాకో అమ్మవారిని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయకమిటీ చైర్మన్ సోము, గుడిరేవు మాజీ సర్పంచ్ మంజుబార్గవి, మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు సల్లు ఉన్నారు.

స్కూల్ కిట్ల పంపిణీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని దొనబండ, ముల్కల్ల, సబ్బెపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్సు, పెన్నులతో కూడిన స్కూల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆవరణలో గల శ్రీలక్ష్మి గణపతి ఆలయం 7వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకంతో పాటు అష్టోత్తర హారతి, గణపతి పూజ, హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమాధులు కూల్చలేదు'

మందమర్రిరూరల్: పట్టణంలోని కేకే–2 ఓసీ జాతీయ రహదారి పక్కన తన నాన్న, తాతకు సంబంధించిన భూమిలో మాత్రమే కొన్నిచెట్లను తొలగించి గుంతను శుభ్రం చేశానని, అక్కడి సమాధులను మాత్రం తొలగించలేదని ఊరుమందమర్రికి చెందిన పుస్కూరి పవన్‌కుమార్ వివరించారు. బుధవారం ఊరు మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నాన్న, తాతకు చెందిన భూమిలో వ్యవసాయం చేద్దామనే ఉద్దేశంతోనే శుభ్రం చేయించానన్నారు. ప్రభుత్వం రోడ్డుకు అవతలి పక్కన శ్మశాన వాటికకు స్థలం కేటాయించిందని, దాని కోసం తనవంతు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. యాపల్ ఏరియా, అంగడిబజార్ ఏరియాల్లోని కొందరి సమాధులు కూలగొట్టారని తనపై చేసిన ఫిర్యాదుపై పవన్‌కుమార్ వివరణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఆలయ కమిటీల నియామకంలో జాప్యం..?

- అభివృద్ధికి నోచుకోని ఆలయాలు



చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయం

చెన్నూర్: నియోజకవర్గంలోని ఆలయ కమిటీల నియామకంలో జాప్యం జరుగుతోంది. చెన్నూర్ మదనంపోచమ్మ ఆలయం, జైపూర్ మండలంలోని వేలాల ఆలయాలకు ఆరేళ్లుగా కమిటీలను నియమించకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని భక్తులు పేర్కొంటున్నారు. చెన్నూర్ పట్టణంలోని మదనం పోచమ్మ, జైపూర్ మండలంలోని వేలాల మల్లికార్జున ఆలయాలకు ఆదాయం ఘనంగా ఉన్నప్పటికీ ధర్మకర్తలి మండలి లేకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకుసాగడం లేదు.

చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయం..

చెన్నూర్ మదనం పోచమ్మ ఆలయానికి ప్రాచీన చరిత్ర ఉంది. సుమారు 200ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం నేటికీ పునర్‌నిర్మాణం జరగలేదు. 2017వరకు ఆలయ కమిటీ చైర్మన్ కొనసాగారు. 2018 నుంచి నేటి వరకు ఆలయ కమిటీ చైర్మన్ నియామకం జరగలేదు. ఆలయ నిర్మాణానికి 2017లో రూ.53లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో నుంచి రూ.22లక్షలు భక్తుల సౌకర్యార్థం షెడ్లు నిర్మించారు. రూ.31లక్షలతో ఆలయ నిర్మాణం చేయాల్సి ఉండగా, కమిటీ చైర్మన్ పదవీ కాలం పూర్తి కావడంతో పనులు నిలిచిపోయాయి. ఆలయంలో ఆది, బుధ, గురు మూడు రోజుల పాటు భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. చెన్నూర్ మండల ప్రజలే కాకుండా కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, మంచిర్యాల, బెల్లంపల్లి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు.

వేలాల మల్లికార్జున స్వామి

జైపూర్ మండలంలోని వేలాల మల్లికార్జున స్వామి ఆలయంలో నిత్యం పూజలు జరుగుతుంటాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఆలయం ఆధ్వర్యంలో జాతర నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఏటా ఆలయానికి సుమారు 15లక్షల ఆదాయం వస్తుంది. ఆలయ కమిటీల నియామకం జరిగితే ఆలయాలు అభివృద్ధి బాట పడుతాయని భక్తులు అంటున్నారు.

నోటిఫికేషన్ వస్తే నియమిస్తాం..



ఆలయ కమిటీ నియామకం కోసం దేవాదాయ, ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి నోటిఫికేషన్ రావాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ వెలుబడితే స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన నియామకం జరుగుతుంది.

– ఎం.రవి, మదనం పోచమ్మ ఈవో, చెన్నూర్

నీరు నిలిచి.. దుర్గంధం..!



జన్నారం: మండలంలోని కామన్‌పల్లి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు పోచమ్మ ఆలయం సమీపంలో నీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారింది. రోడ్డుకిరువైపులా నీరు నిలువడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ విషయంలో అధికారులు దృష్టి సారించి, పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలి



బెల్లంపల్లి: దీక్ష చేస్తున్న ఆశ వర్కర్లు

బెల్లంపల్లి/తాండూర్: ఆశా వర్కర్లను దూషించిన బెల్లంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ సూపర్ వైజర్ మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బెల్లంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట, తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ వర్కర్లు నిరాహార దీక్ష, ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ...ఆశ వర్కర్ల రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరు వర్కర్లను సూపర్‌వైజర్ మధు తిట్టారని తెలిపారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు రేణుక, స్వర్ణలత, అమల, శ్యామల, పద్మ, స్రవంతి, మాధవి, లావణ్య, రజియా, రాజమణి, తాండూర్‌లో శంకర్, రాజేశ్వరి, కవిత, నర్సుబాయి, లక్ష్మి, సునీత, సుమలత, శ్రీదేవి, భాగ్య, సావిత్రి, భారతి, తిరుమల, రేవతి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం చేయండి



సమావేశం నిర్వహిస్తున్న సీఐ, అధికారులు

తాండూర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ శాఖల అధికారులు నిర్దేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ శాఖల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూర్ సీఐ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ... రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని సూచించారు. సురభి గోధాక్షేత్రలో నిర్వహించే రక్తదాన శిబిరానికి కలెక్టర్ కుమార్ దీపక్, అడిషనల్ కలెక్టర్ ఎస్.మోతిలాల్, బెల్లంపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి పి.హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అంజన్‌కుమార్, మురళి, ఇతర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చెన్నూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందువులకు సంఘీభావంగా బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్‌లో మానవహారంగా ఏర్పడి దాడుల్లో మృతి చెందిన అమరుల ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ఐక్యవేదిక నాయకులు, పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు'



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య అన్నారు. కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, పాన్‌మసాల, గుట్కా వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులు కావొద్దని సూచించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని, చదువుపై ఏకాగ్రత ఉండదన్నారు. ఉత్తమంగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. తల్లిదండ్రుల కలను నిజం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సోమయ్య, లెక్చరర్లు గురుపాదం, కరుణాకర్, చంద్రయ్య, లక్ష్మణ్, సదయ్య, తిరుమల దేవి, లక్ష్మి, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'హర్ ఘర్ తిరంగా'



విద్యార్థులతో బీజేపీ నాయకుల ర్యాలీ

దండేపల్లి/మంచిర్యాలఅర్బన్/కాసిపేట: భారత ప్రధాని మోదీ పిలుపులో భాగంగా దండేపల్లిలో బీజేపీ నాయకులు బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. ప్రతి ఇంటిపైన జెండా ఎగురవేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల వృత్తి విద్యా కళాశాల, శ్రీసాయి పారా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో మంచిర్యాలో విద్యార్థులు ఐబీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. కాసిపేట మండలం లంబాడితండాలో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు పంపిణీ చేశారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి నిమజ్జన పూజలు



పూజల్లో పాల్గొన్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఏరియాలో ఆర్కే 5బి గనిలో మైసమ్మ అమ్మవారికి నిమజ్జన పూజలు నిర్వహించారు. ఆలయం క్రింద మైనింగ్ చేయాల్సి రావడంతో ఆలయ మూసివేతకు పూనుకున్నారు. దీనికి గాను అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారికి నిర్వహించిన ముందస్తు ప్రత్యేక పూజల్లో జీఎం సంజీవ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం ఉదయం మరిన్ని పూజలు నిర్వహించి సాయంత్రం గోదావరి నదిలో నిమజ్జనం చేయనున్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా ఎస్‌ఓటూ జీఎం యన్ సత్యనారాయణ, ఇందారం ఓసీపీ పీఓ ఏపీ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ టీ. శ్రీనివాస్, ఏజెంట్ రాముడు, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, పిట్ సెక్రెటరీ నర్సింగరావు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం



ఎస్టేట్ అధికారి స్వప్నను సన్మానిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో బదిలీ అయి ఇతర ఏరియాలకు వెళ్తున్న వారిని, ఇతర ఏరియాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులను ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. శ్రీరాంపూర్ ఎస్టేట్స్ అధికారిగా పనిచేసి మందమర్రి ఏరియాకు వెళ్తున్న స్వప్నను జీఎం కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటుజీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, పర్సేస్ అధికారి చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఐఈడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. కైరిగూడ ఓసీపీ పీవోగా పనిచేసి శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌ఓటుజీఎంగా బదిలీపై వచ్చిన సత్యనారాయణను టీబీజీకేఎస్ నేతలు సన్మానించారు. జీఎం కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆయన్ను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, తిరుపతిరెడ్డి, ఉత్తేజ్‌రెడ్డి, గొర్ల సంతోశ్, మారం శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేసి ఇతర ఏరియాలకు బదిలీపై వెళ్తున్న ఇంజనీర్ యాదయ్య, పీవో టీ. శ్రీనివాస్‌లను ఆర్కే 7గ్రూప్ ఏజెంట్ రాముడు, ఇతర అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఆర్కేన్యూటెక్ మేనేజర్ స్వామిరాజు, ఆర్కే 7గని మేనేజర్ రవిశంకర్, గ్రూప్ ఇంజనీర్ రవిచరణ్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలపై యూఎస్‌ఎఫ్‌ఐ వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల సమస్యలపై యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మండల విద్యాధికారి కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన భోజనం అందించేలా చూడాలన్నారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులు వర్షాకాలం సీజనల్ వ్యాధులతో అవస్థ పడుతున్నారని, వెంటనే ఏఎన్ఎంతో కనీస వైద్య సౌకర్యం కల్పించేలా చూడాలన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లోనే కాకుండా గురుకులాల్లో ఏసీబీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

జైపూర్: సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ, వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఒకరికి డెంగీ కేసు నమోదు కావడంతో గ్రామాల్లో పర్యటించిన అధికారులు, అతడి ఇంటి పరిసరాల్లో రసాయన మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రావు, కార్యదర్శి రాకేశ్, తదితరులు ఉన్నారు.

బోనాలతో శోభాయాత్ర

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగిడి ఆదిపరాశక్తి అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి క్షీరాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

బెల్లంపల్లి/దండేపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో, బస్తీల్లో జాతీయ పతాకాన్ని ఎగుర వేయడానికి ఏర్పాట్లు చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు త్రివర్ణంతో కూడిన తోరణాలు, రంగు రంగుల కాగితాలు, మామిడి ఆకులతో అందంగా అలంకరించారు.

ఐవైసీ ఓటింగ్‌లో పాల్గొని విజయవంతం చేయాలి

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన విభాగం 18–35 సంవత్సరాలు వయస్సు గల యువతీ, యువకులు ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) యాప్ ద్వారా ఓటింగ్‌లో పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అకారపు రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలో మార్కెట్ ఏరియాలో బుధవారం తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలను యాప్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్యవర్గం

నస్పూర్: మండల ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కృష్ణాకాలనీకి చెందిన రాగిడి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీసీసీలోని ఎంఎం గార్డెన్‌లో బుధవారం జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తూముల నరేష్ అధ్యక్షతన మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చిలుక మల్లేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బద్రి శివ, ప్రధాన కార్యదర్శిగా సంపత్, కార్యవర్గ సభ్యులుగా 22మందిని ఎన్నుకున్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం జై హనుమాన్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మల్యాల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా గుంపుల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా కోట రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.డీ.రఫీక్, కోశాధికారిగా ఆసాది ప్రవీణ్, ముప్పిడి లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

కుట్టుమిషన్ అందజేత

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన నిరుపేద మహిళ బండ సుమలతకు దండేపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం కుట్టు మిషన్‌ను అందజేశారు.

బంద్ ప్రశాంతం..!



భీమారంలో మూసి ఉన్న షాపులు



నస్పూర్: మూసివేసిన దుకాణాలు



మందమర్రిరూరల్: బంద్‌లో పాల్గొన్న వ్యాపారులు

లక్సెట్టిపేట/భీమారం/జన్నారం/నస్పూర్/మందమర్రిరూరల్/వేమనపల్లి/జైపూర్: బంగ్లదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణ హోమంపై నిరసనగా బుధవారం హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ ప్రకటించారు. ఈ క్రమంలో లక్సెట్టిపేట, భీమారం, జన్నారం,నస్పూర్‌లో బంద్ విజయవంతమైంది. దుఖాణాలు, హోటళ్లు, విద్యా సంస్థలు, పెట్రోల్‌బంకులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. నస్పూర్ పట్టణ కిరాణా వర్తక సంఘం యజమానులు సీసీసీ కార్నర్ నుంచి షిర్కే చౌరస్తా, రాయల్ గార్డెన్ మీదుగా సీసీసీ టౌన్‌షిప్ వరకు ర్యాలీ నిర్వహించారు.



వేమనపల్లి: మూసి ఉన్న దుకాణ సముదాయాలు



జన్నారం: పెట్రోల్ బంకు బంద్ చేయిస్తూ..



జైపూర్: మూసి ఉన్న దుకాణ సముదాయాలు

రేపు చెన్నూర్ బంద్

చెన్నూర్: ఈ నెల 16న శుక్రవారం చెన్నూర్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. వ్యాపార, విద్యా సంస్థలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ స్వచ్ఛందంగా శాంతియుతంగా బంద్ పాటించాలని హిందు సంఘాల ఐక్య వేదిక నాయకులు కోరారు.

విద్యుత్ సిబ్బంది అలసత్వం..!

- కరెంట్ సరఫరాలో అంతరాయం
- అధికారులకు చెప్పినా స్పందించని వైనం
- ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసుకున్న గ్రామస్తులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేచిచూస్తున్న గ్రామస్తులు

వేమనపల్లి: మండలంలో విద్యుత్‌శాఖ అధికారుల పనితీరు మారడం లేదు. పొద్దంతా విధుల్లో ఎల్‌సీలు తీసుకుంటూ, విద్యుత్ సరఫరాలో విచ్చలవిడిగా అంతరాయం కలిగిస్తున్నారు. రాత్రిళ్లు విద్యుత్ సరఫరా చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రజలు ఉక్కపోత, దోమల బెడదతో నిద్రకు దూరమవుతున్నారు. మండల కేంద్రంలోని అటవీ కార్యాలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం రాత్రి చెడిపోయింది. దీంతో పద్మశాలీ వాడ, యాదవవాడ, ఎస్సీకాలనీ, గొల్లవాడ, ముస్లిం వాడలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా, ఎవరూ స్పందించలేదు. స్థానికంగా ఉండాల్సిన జేఎల్ఎం, లైన్ ఇన్స్‌పెక్టర్, లైన్‌మెన్ ఎవరూ అందుబాటులో లేరు. సుమారు 50మంది గ్రామస్తులు అర్ధరాత్రి వరకూ ఇబ్బందిపడుతూ ట్రాన్స్‌ఫార్మర్ వద్దే మూడు గంటలు వేచి చూశారు. కింది స్థాయి సిబ్బంది రాకపోవడంతో బెల్లంపల్లిరూరల్ ఏడీకి గ్రామస్తులు సమాచారం ఇవ్వగా, ఆయన స్పందించి ఏఈని అప్రమత్తం చేశారు. ఏఈ దీక్షిత్ సైతం కిందిస్థాయి సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించే ప్రయత్నం చేసినా, ఎవరూ రాలేదు. గత్యంతరం లేక గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి ఎల్‌సీ తీసుకున్నారు. గ్రామస్తులే చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ బుష్‌కు ఉన్న లక్‌ను తొలగించి సప్‌లె వైర్ అమర్చుకున్నారు. దీంతో ఆయా వాడలకు కరెంట్ సరఫరా అయింది.

విద్యార్థులకు షూలు అందజేత

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 70మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కార్మూరి సుధాకర్, ముద్దసాని రాజమౌళి రూ.14వేల విలువ చేసే షూస్‌ను బుధవారం అందించారు.